# 12. అహింసా వాదం - 1988 స్టయిల్

1968లో నేను విజయనగరంలో ఉద్యోగం చేసేను కదా. ఆ రోజుల్లో ఒకనాడు ప్రభుత్వ సంగీత (మరియు నృత్య) కళాశాలకు వెళ్లి, నాకు పాత పరిచయం లేకపోయినా పేర్లు తెలిసిన వాళ్లే కాబట్టి అక్కడ ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న సంగీత విద్వాంసుల్ని కొందరిని పలకరించడం అయింది. హరికథా పితామహుడని పేరు పొందిన ఆదిభట్ల నారాయణదాసు గారిది ఒకటి, "ఫిడేలు నాయుడు" గా ప్రఖ్యాతి చెందిన ద్వారం వెంకట స్వామి నాయుడు గారిది ఒకటి: తైలవర్ణ చిత్రాలు అక్కడ చూసేను. ఆ సంతోష సంరంభంలో ఇవతలికి వచ్చేస్తూ వుంటే, నాతోపాటుగా నడుస్తూ వస్తున్న టైపిస్టు సత్యనారాయణ నన్ను మాటల్లో పెట్టి "ఫిడేల్ నాయుడు గారికి, గాంధీ గారికి తేడా యేటో చెప్పారే!" అన్నాడు.

"నాకు తెలీదురా, అసలు వాళ్లిద్దరికీ పోలికే లేదు కదా, తేడా చెప్పమంటావేంటీ?" అని నేను కొంచెం విసుక్కున్నాను.

సత్యనారాయణ గట్టిగా నవ్వేడు. "తేడా అంటే తేడా వుంది మరి. నాయుడు గారైతే ఎక్కడికెళ్లినా వైలెన్సు, గాంధీ గారికైతే ఎక్కడికెళ్లినా నాన్ వయలన్స్ కదా. అది తేడా కాదా!" అన్నాడు.

"ఓరి నీ యింట పటార్నా, ఇదేమి జోకురా!" అని సత్యనారాయణని తిట్టీకూడాను, శబ్దాశ్రయమైన వాడి హాస్యానికి నవ్వేను. (నీ ఇంట పటార్నా అని విజయనగరంలో ఓ తిట్టు వాడుకలో ఉంది. అయితే పటార్ను అంటే అర్థం ఏమిటో నాకు అప్పుడు తెలియదు, ఇప్పటి దాకా కూడా తెలీదు)

అలా నవ్వుతూనే సత్యనారాయణకి చెప్పేను. 'వాళ్లిద్దరికి తేడా అని నువ్వనుకుంటున్నావు గాని ఒరే; వయొలిన్స్ వాయించి ఒప్పించడం, మెప్పించడం ఎంత కష్టమో నాన్‌వయొలెన్స్ పాటించడం, రాణించడం అంత కష్టమున్నూ. కనుకా, ఇహ మీదట నువ్వీ జోకు ఇంకెవరి దగ్గరైనా వేసినపుడు నాయుడు గారికి, గాంధీ గారికి తేడా యేమిటని అడక్కు. పోలికేమిటని అడుగు, అప్పుడు వాళ్ల గొప్పతనమూ తెలుస్తుంది; నువ్వు కుడా తిట్లు తినకుండా బైట పడగలవు.'

1955 ప్రాంతంలో వొచ్చిన ఎం.ఎల్.ఎ. అనే తెలుగు సినిమా కోసం ఆరుద్ర గారు రాసిన పాటలో ఒక చరణం ఈనాటికీ గుర్తుంటుంది.(ఈ నాటి వాళ్లకీ పరిచయం అయ్యుంటుంది. ఎందుకంటే ఎన్నో రికార్డులు పగల గొట్టేసిన ఆకాశవాణి వారు ఆ రికార్డును బద్దల కొట్టేకుండా దాచి గాంధీ జయంతి నాడు, గాంధీ వర్ధంతి నాడు ఎలాగో సందు చూసుకుని కార్మికుల కార్యక్రమంలో గాని, గ్రామస్థుల కార్యక్రమములో గాని, మధురిమ, మధుర గీతాలు లాంటి సినీ గీతికా కార్యక్రమంలో గాని ఆ పాట ఒకసారి ప్రసారం చేస్తున్నారు.)

"నమో నమో బాపూ.

మాకు

న్యాయమార్గమే, చూపు" అని ఆ పాట పల్లవి.

నీవు తీసిన బాటలు దాటి
నీతిని విడచి నిన్నే మరచి
నీ అనుచరులే మారెదరేమో
నిదుర నిండి లేపు.

బాపూ
నమో నమో బాపూ!" - అని ఆ చరణం.

నిష్ఠూరం గట్టిగా లేని నిజం కదా అని ఆ చరణం విన్నప్పుడూ తల్చుకున్నప్పుడూ నాకు 'ఐస్ లోంచి వాటర్, ఒచ్చేస్తూ వుంటుంది.'

అన్నట్టు, ఆ జోక్ చెప్పలేదు కదూ, అడవి రాముడు, యమగోల లాంటి తెలుగు సినీ క్లాసిక్స్ లో నటించిన ఒక తార క్రమంగా హిందీ చిత్ర రంగానికి ఇంటర్నేషనల్ సబ్బు యొక్క టి.వి. ప్రకటనల్లోకి తరలి వెళ్లిపోయింది. తెలుగు సినీ తారగా ఉన్నన్నాళ్లు ఆవిడని అంతగా పట్టించుకోని మన దూరదర్శన-కార్యక్రమ-నిర్మాతలు ఆవిడ హిందీ చిత్ర రంగానికి వారానికి ఐదు రోజులు కేటాయిస్తోందని తెలియగానే ఆవిడని ఇంటర్వ్యూ చేసి ఒక కార్యక్రమం ప్రసారం చెయ్యకపోతే చాలా నష్టం అని గ్రహించినటువంటి వారై ఆవిడ మద్రాసులో ఉండే సమయం కనిపెట్టి ఆ ఇంటర్వ్యూ తయారు చేసి ప్రసారం చేసేరు. అందులో ఒక ప్రశ్నకి సమాధానంగా ఆవిడ: "నేను సిన్నపుడసలు బడికే యెళ్ల లేదండీ. కొద్దిగా పెద్దయినాకా కాన్వెంట్‌లో జేరి చదువు కంటిన్యూ జేశా." అన్నారు, ఇంకో ప్రశ్నకి సమాధానంగా "అవునండి, మరేనండి. ఆ సీను గుర్తొస్తెడికల్లా నాకు ఐస్‌లోంచి వాటర్ ఒచ్చేస్తాది!" అన్నారు. (ఇక్కడ ఐస్ అనగా మంచుగడ్డ కాదని; కళ్లు అని, వాటర్ అనగా జలం కాదని; కన్నీరు - అని గ్రహించవలెను.) ఆ ఇంటర్వ్యూ టి.వి.లో తిలకించిన అనంతరము నేను కూడా "కళ్లమ్మట నీళ్లు తిరిగాయి", "గుడ్లనీరు కుక్కుకుని" లాంటి నాటు ప్రయోగాలు మానేసి ఇంచక్కా ఐస్ లోంచి వాటర్ ఒస్తుందనే వాడుతున్నాను.

మా వూరి మేయర్‌గారు నిరాహార దీక్ష ప్రారంభించేరు. పాత టవున్‌కీ కొత్త టవున్‌కీ మధ్య ఉన్న చెరువులో కవ్వు తీయించడానికీ చెరువు గట్టు మీద రోడ్డు వేయించడానికీ డబ్బు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని పత్రికా విలేకర్లతో మీటింగ్ పెట్టి, టిఫిన్లూ కాఫీలు అయ్యేక నిరాహార దీక్ష ధ్యేయం వివరించారు. "ఈ ఉదయం నుండి నిరాహార దీక్ష అన్నారు కదా. మరి మాతోపాటు స్వీటూ, హాటూ తీసుకున్నారే?" అని ఒక కృత్రిమ విలేకరి అడిగేడుట. (ఈమధ్య కృత్రిమ విలేకరుల బెడద ఒకటి వచ్చి పడుతోంది). "అబ్బే, ఇదే ఆఖరు. మళ్ళీ చీఫ్ మినిస్టర్ గారు వచ్చి దీక్ష మానండి - అని అడిగేదాకా ఏం తినను!" అని చెప్పారట మేయరుగారు.

"గాంధీ మార్గంలో సత్యాగ్రహం చాలా ముఖ్యమైంది" అని ఏదో వ్యాసమో ఉపన్యాసమో మొదలు పెట్టిన ధోరణిలో అన్నాడు బసవరాజు.

"మా ఇంట్లో రోజూ సత్యాగ్రహమే" అన్నాను.

"అదెల్లాగ?" అని బసవరాజు నేను వేసిన లూప్‌లైను మీదకి దిగేడు.

"మా ఆవిడ పేరు సత్యభామ కదా. రోజూ ఆవిడకి నా మీద దేనికో ఒకదానికి ఆగ్రహం

వస్తూనే ఉంటుంది. వెరసి మా ఇంట్లో రోజూ సత్యాగ్రహమే.''

బసవరాజు దెబ్బతినేశాడు గాని పాయింటు మార్చేసి మళ్లా మెయిన్ లైను లోకి దూకేడు; "గవర్నమెంటు ద్వారా మనకి ఏదైనా పని సానుకూల పడాలంటే వార్తాపత్రికల్లో 'స్థానిక సమస్యలు' లాంటి శీర్షికలకి ఉత్తరాలు రాయడం దగ్గర్నుంచి నల్ల బాడ్జీలు ధరించడం, ధర్నాలు చెయ్యడం, రాస్తారోకోలు, బంద్‌లు నిర్వహించడం వరకూ ఎన్నో మార్గాలున్నాయి. వీటన్నింటిలోకి నిరాహార దీక్ష శక్తివంతమైది. అందులోనూ 'రిలే' నిరాహార దీక్ష వల్ల 'డిలే' అవుతే అవ్వొచ్చుగాని అమరణ నిరాహార దీక్షకి తిరుగులేదు.''

"ఆమరణ నిరాహార దీక్ష మంచిదే కావచ్చు కాని అందులో అహింసా సిద్ధాంతం దెబ్బ తింటోంది'' అని నేను క్లారిఫై చేసేను.

మేయర్ గారి ఆమరణ నిరాహార దీక్షలో మాత్రం రోజురోజుకీ దీక్ష ముదిరిపోవడం ఆరోగ్యం చితికిపోవడం జరిగింది. ఒక షామియానా అద్దెకు తెచ్చేరు. ఆ నీడ పట్టున గడ్డి పర్చి జంబుకానాలు వేసి రెండు పెద్ద పెద్ద రౌండు తలగడాలు పెట్టేరు. మేయర్‌గారి మెడలో మొదటి రోజున నాలుగు పూల దండలు పడ్డాయి. మీటింగుల్లో అయితే దండ మెడలో పడీపడక ముందే తీసేసి టేబిలు మీద పెట్టేసే అలవాటున్నా ఇక్కడ మాత్రం ఆ దండలు మెళ్లోనే వుంచేసుకున్నారు. వాటితో ఫొటోలు దిగేరు. క్రమంగా వాటిని మొయ్యలేనంత నీరసం వచ్చి ఒక దండ మాత్రం వుంచుకున్నారు. అండగా వున్నవాళ్లూ దండలు వేసినవాళ్లూ కిర్రెక్కి పోయారు. గవర్నమెంట్ డౌన్‌డౌన్, మేయర్ గారు జిందాబాద్, వుయ్‌వాంట్ క్లీన్ టాంక్ , వుయ్‌వాంట్ క్లీన్ టాక్ అంటూ (స్లో) గన్‌లు పేల్చుకుంటూ (ఊ)రేగిపోయారు. కలెక్టరుగారు బ్రతిమాలితే విన్లేదు. ఆర్.డి.వో. గారు బెదిరిస్తే లొంగలేదు. పోలీసులు రంగంలో దిగేరు. శాంతి భద్రతల పునరుద్ధరణ కోసం టియర్‌గాస్ వదిలేరు. గాలిలో కాల్పులు జరిపేరు. రాళ్ల దెబ్బలు తిన్నారు. ఆత్మరక్షణ కోసం ఎదురు కాల్పులు జరిపారు. యాభైమంది చచ్చిపోయారు. నూట ఎనభై మందికి గాయాలు తగిలేయి. చీఫ్ మినిష్టర్ గారు ప్రత్యేక విమానంలో వొచ్చి సమయోచిత వాగ్దానాలు చేసి నిమ్మకాయనీళ్లు కలిపించి స్వయంగా మేయర్ గారి నోటికి అందించేరు. ఆ విధంగా సమస్య 'శాంతియుతంగా' పరిష్కారం అయిపోయింది.

"ఇదంతా గాంధీగారు చెప్పిన అహింసా సిద్ధాంతం ప్రకారం జరగలేదు'' అని నేను బసవరాజుని నిలదీశాను!

"అదేం కాదు. అంతా అహింసా సిద్ధాంతం ప్రకారమే జరిగింది. అయితే కార్య వాదానికి ప్రాముఖ్యం పెరుగుతున్న ఈ రోజుల్లో అహింసా సిద్ధాంతం అచ్చంగా గాంధీగారు చెప్పిన పద్ధతినే జరగాలంటే కుదరదు. గణిత శాస్త్రంలో ఉన్నట్టే రాజకీయ శాస్త్రంలో కూడా సిద్ధాంతాలకి ఉప సిద్ధాంతాలుంటాయి. లక్ష్యం ఒకటే అయినపుడు ఆచరణ మార్గంలో కొంచెం తేడా వచ్చిందని నువ్వు ఊరికే సెంటిమెంటల్ అయిపోకూడదు. ఎవరూ బలి అయిపోకుండా పన్లు జరిగిపోవడానికి మన రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం బ్రిటీష్ ప్రభుత్వంలా పిరికి సన్నాసులు కావు'' అన్నాడు బసవరాజు.

★